# కీటకములు మరియు సాలెపురుగులు

- వాసంతి మాఘువు.

- సాలెపురుగులకు ఎనిమిది కాళ్ళు (కీటకముల కంటే ఒక జత ఎక్కువ) ఉంటాయి. వాటికి రెండు శరీర అంగములు - తల, ఉదరం ఉంటాయి. చాలావాటికి ఎనిమిది సాధారణ కన్నులు ఉంటాయి. వాటికి ఎముకలు ఉండవు, కాని బాహ్య కంకాళం అనే గట్టి కవచము కలిగి ఉంటాయి. ఇది వాటి సున్నితమైన లోపలి భాగములను కాపాడుతూ, వాటికో ఆకారాన్ని ఇస్తుంది. అవి పెరగడానికై ఈ కవచాన్ని కొత్తదానితో మార్చుతూ ఉండాలి.

- కీటకములకు ఆరు కాళ్ళు మరియు మూడు శరీర భాగములు - తల, రొమ్ము మరియు ఉదరము ఉంటాయి. చాలా కీటకములకు ఎగిరేందుకు రెక్కలు, స్పర్శద్వారా వస్తువులను గుర్తించడానికి మీసాలు లేదా కొమ్ములు ఉంటాయి.

- 'ఆఫ్రికన్ గోలిత్' అనబడే అతి పెద్ద కుమ్మరి పురుగు ఆరు అంగుళాల పొడవు, నాలుగు ఔన్సుల బరువు కలిగి ఉంటుంది. ఇది కుళ్ళిన కలప ఉండే ప్రదేశములలో ఉష్ణమండల అరణ్యములలో నివసిస్తుంది.

- కందిరీగ జాతికి చెందిన 'ఫెయిరీ ఫ్లై' అనబడే కీటకము అతి చిన్నది. దాని రెక్క ఒక బిందువు కంటె చిన్నగా ఉంటుంది. ఆడ ఫెయిరీ ఫ్లై ఇంచుమించు 20 గుడ్లు వరకు వేరొక కీటకము యొక్క గుడ్డు లోపల పెడుతుంది.

- జోరీగ దాని శరీరము పొడవుకు 150 రెట్ల ఎత్తుకు దూకగలదు. అదే మనము మన శరీరపు పొడవుకు 150 రెట్లు ఎత్తుకు దూకగలిగితే, ఇంచుమించు మైలులో మూడవ వంతు ఎత్తుకు గాలిలో దూకవచ్చు.

- మనము మనలాంటి 850 మందిని ఎత్తగలమా? కాని 'రైనోసారస్' కుమ్మరి పురుగు దాని బరువుకు 850 రెట్లు బరువును ఎత్తగలదు. ఆశ్చర్యంగా ఉంది కదా!

- కొన్ని తేళ్ళు తోకలో కుట్టడానికి ఉపయోగపడే కొండితో పాటు, కాంతి తీవ్రతను తెలిపే కణములు ఉంటాయి. ఈ కణముల వలన, వాటి తలలు భూమిలోనికి జొనిపి యున్నా, వాటికి అది పగలో, రాత్రో తెలుసుకునే అవకాశము కలుగుతుంది.

***'తల రాయి చేసుకోవడం' అంటే తెలుసా?*** *ఎంత మొత్తుకున్నా ఏమీ తలకెక్కించుకోని వారిని 'తల రాయి చేసుకున్నార'నడం (నేడు మరచిన) నాటి సామెత.*

- తేనెటీగ ఎక్కడైనా మంచి మకరందం ఉన్నట్లు గ్రహిస్తే, అది వెంటనే గూటి వద్దకు వచ్చి ప్రత్యేకమైన నృత్యం చేస్తుంది. దాని కదలిక వేగం, దిశను బట్టి మిగిలిన తేనెటీగలకు మకరందమెక్కడ ఉన్నదో తెలుస్తుంది.

- కీటకముల కళ్ళు వేలకొలది కటకములతో నిర్మించబడి ఉంటాయి. దీనివలన మనము చూసే ప్రపంచము కంటే భిన్నమైన ప్రపంచాన్ని అవి చూడగలుగుతాయి. అంతేకాక దగ్గరలో జరిగే కదలికలను ఎంతో నిశితంగా తెలిసుకోవచ్చు.

- తూనీగలు, కొన్ని కందిరీగలు, తుమ్మెదలు, చిమ్మటలు మొదలైనవి గంటకు 30 మైళ్ళ వేగంతో ఎగురగలవు. సీతాకోకచిలుకలు తమ రెక్కలను సెకనుకు 5 నుండి 12 సార్లు, హాక్ చిమ్మటలు సెకనుకు 70 సార్లు, కొన్ని చిన్న పురుగులు సెకనుకు 1000 సార్లు కొట్టుకుంటాయి.

- జెర్రి, రోకలిబండ, శతపాది, సహస్రపాది అనబడే క్రిముల శరీరములు చిన్న చిన్న భాగములు అతికినట్లు ఉండి, పొడవుగా, వంపులు తిరగడానికి అనువుగా ఉంటాయి. సహస్రపాది (మిల్లీపీడ్)కి ప్రతి చిన్న భాగానికి రెండు జతల కాళ్ళచొప్పున, శతపాది (జెర్రి, రోకలిబండ)కి ప్రతి భాగానికి జత కాళ్ళచొప్పున ఉంటాయి. సహస్రపాది క్రిములు శాకాహారులు. శతపాదులు మాంసాహారులు. ఇవి రాత్రిపూట, వాటికి ఉండే శక్తివంతమైన, విషపూరితమైన దవడలతో, చిన్న క్రిములపై దాడిచేస్తాయి.

(మిగతా భాగం వచ్చే సంచికలో)

## పెద్దల మాటల్లో జాలువారిన నిజాలు

| | |
|---|---|
| **హరిహరులకు భేదం** | ఇంద్రియ నిగ్రహం కోసం సాధనచేసేవారి మనో |
| నిలువు బొట్టైతే రంగడు! | నిశ్చలతత్వం కుదిరి, వారు మారితే మారుతి! |
| అడ్డ బొట్టైతే లింగడు!! | చాంచల్యం వీడక, వారిలో మార్పు లేకపోతే కోతి!! |

కోడలా కోడలా కొడుకు పెళ్ళామా! ఓయమ్మా!
పచ్చి పాలామీద మీగడా ఏదమ్మా!
ఆ వేడి పాలలోన వెన్న ఏదమ్మా!!

| నాడు | నేడు |
|---|---|
| అత్తమ్మ నీ కెపుడు ఆరళ్ళే గాని ఓయమ్మా! | అత్తమ్మ నీకు తెలియదేమోగాని ఓయమ్మా! |
| పచ్చిపాలమీద మీగడుంటుందా? | డెయిరీ ఫారంలోనె పాలనుండి వెన్నతీస్తున్నారు |
| ఆ వేడి పాలలోన వెన్న ఉంటుందా? | ఇక వేడి పాలలోన వెన్న ఎక్కడుంటుంది? |